సాక్షి
వైఎస్‌ఆర్‌ జిల్లా

గురువారం | 15 | ఆగస్టు | 2024



రాజ్‌భవన్‌కు స్టాఫ్‌ నర్సులు
ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌ నర్సులు సూర్య ఫాతిమా, మానసలకు అరుదైన అవకాశం లభించింది. రాజ్‌ భవన్‌లో 'ఎట్‌ హోం'కు ఆహ్వానం అందింది. -IIలో



పశ్చిమగోదావరి జట్టు ఘనవిజయం
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్‌ జిల్లాల అండర్‌–19 మల్టీ డేస్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో పశ్చిమగోదావరి జట్టు ఘన విజయం సాధించింది. -IIలో

గరిష్టం/కనిష్టం
38.0/27.8

వాతావరణం
జిల్లాలో బుధవారం 27.8 నుంచి 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.99 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్‌

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

స్వాతంత్య్ర దినోత్సవం గురువారం ఉదయం 8.30 గంటలకు కడప పోలీసు పెరేడ్‌ మైదానంలో ఘనంగా ప్రారంభం కానుంది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహమ్మద్‌ ఫరూఖ్‌ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమ వివరాలు..
- ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకా విష్కరణ, పోలీసుగౌరవ వందన స్వీకరణ
- 9.05 గంటలకు పోలీసు కవాతు పరిశీలన
- 9.15 గంటలకు మంత్రి సందేశం
- 9.45 గంటలకు మార్చ్‌ఫాస్ట్‌
- 9.50కు స్వాతంత్య్ర సమరయోధులకు సత్కారం
- 10.00 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన
- 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసు డాగ్‌ షో, ప్రదర్శనలు
- 10.55 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎన్‌సీసీ, స్కాట్స్‌, వివిధ పటాలాల ప్రదర్శనల్లో పాల్గొన్న వారితో ఫోటో షూట్‌
- 11.05 గంటలకు ప్రశంసాపత్రాల ప్రదానం
- 11.55 గంటలకు స్టాల్స్‌ సందర్శన
- 12.55 గంటలకు జాతీయ గీతాలాపనతో ముగింపు

–కడప సెవెన్‌రోడ్స్‌







పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో జెండా పండుగ ఏర్పాట్లు

ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడాలి

- జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి, ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు
- స్వాతంత్య్ర దినోత్సవాలలో సౌకర్యాల కల్పన, భద్రత, పరేడ్‌ గ్రౌండ్‌లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

కడప సెవెన్‌రోడ్స్‌: జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలని, అలాగే స్వాతంత్య్ర దినోత్సవాలను దేశభక్తి ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు సంయుక్తంగా అధికారులను ఆదేశించారు. బుధవారం కడప పోలీస్‌ పెరేడ్‌ మైదానంలో నిర్వహించనున్న వేడుకల నిర్వహణలో భాగంగా భద్రత, బందోబస్తు, పరేడ్‌ గ్రౌండ్‌లో అరేంజ్‌మెంట్స్‌ తదితర అన్ని ఏర్పాట్లపై.. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు, జేసీ అదితి సింగ్‌లతో కలిసి కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటికీ జెండా ఆవిష్కరణ ఫోటోలు, వీడియోలను అఫీషియల్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలన్నారు. పోలీస్‌పరేడ్‌ గ్రౌండ్‌లో ఉత్సవాల ఏర్పాట్లలో ఎటువంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీలు కడప ఆర్డీఓ వెంకటపతి, కృష్ణా రావు, సుధాకర్‌, కేఎంసీ కమిషనర్‌ వైఓ నందన్‌, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్‌, ఎస్పీలు

న్యూస్‌రీల్‌

దరఖాస్తుల ఆహ్వానం
కడప అర్బన్‌: వైఎస్‌ఆర్‌ ఉమ్మడిజిల్లా, అనంతపురం జిల్లాలలో ఇంటర్మీడియట్‌ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థుల నుంచి రెండేళ్ల ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్‌) శిక్షణ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రిమ్స్‌ ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రెనింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రోజారాణి తెలిపా రు. ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9290814424, 9014289905, 8247810205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్‌
కడప రూరల్‌: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్‌–4) పరిధిలో జరుగుతున్న కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్స్‌ల నియామకాల కౌన్సెలింగ్‌ ప్రశాంతంగా జరుగుతోంది. రెండవ రోజైన బుధవారం 50 మందికి గాను 41 మంది కౌన్సెలింగ్‌కు హాజరై నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ వై శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల మేరకు అర్హులైన వారిని స్టాఫ్‌ నర్స్‌లుగా ఎంపిక చేశామన్నారు. డిప్యూటీ డైరెక్టర్‌ భక్తవత్సలం, సూపరింటెండెంట్‌ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బిల్లుల చెల్లింపు
కడప సిటీ: జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన పెండింగ్‌ బిల్లులు ప్రభుత్వం చెల్లించిందని డ్వామా ఇన్‌ఛార్జి పీడీ విజయ్‌కుమార్‌ తెలిపారు. 2,17,227 మంది ఉపాధి కూలీలకుగాను రూ.77.29 కోట్లు కూలీలకు డబ్బు అందాల్సి ఉండగా ఈ మొత్తం కూలీలకు చెల్లింపు జరిగినట్లు ఆయన వివరించారు. మొత్తం 29.73 లక్షల పనిదినాలకు సంబంధించి ఈ బకాయిలు చెల్లించారన్నారు.

రూ.10 నాణేలన్నీ చెల్లుబాటు
కడప సెవెన్‌రోడ్స్‌: రిజర్వుబ్యాంక్‌ విడుదల చేసిన 14 రకాల 10 రూపాయల నాణేలన్నీ చెల్లుబాటు అవుతాయని కలెక్టర్‌ శివ శంకర్‌ లోతేటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రూ.10 నాణేముల అవగాహన కోసం ఈనెల 16న కెనరా బ్యాంక్‌ రీజినల్‌ హెడ్‌ కె మురళీ మోహన్‌ తో కలిసి ఏడు రోడ్ల కూడలిలో పెద్ద ఎత్తున పది రూపాయల నాణేలను చలామణి జరుపుతామని కలెక్టర్‌ తెలిపారు. రూ.10 నాణెం చెల్లదనే అనుమానాలు సామాన్యుల్లో, వ్యాపారులు, దుకాణదారులు, షాపుల నిర్వాహకుల్లో ఉన్నాయన్నారు. ఎటువంటి సంకోచం లేకుండా అన్ని లావాదేవీలలో రూ. 10 నాణేలను వినియోగించవచ్చునని తెలిపారు.

'క్యాంపస్‌' ద్వారా ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్‌ కుమారస్వామిగుప్తా

వేంపల్లి: ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ ఐటీలో మెకానికల్‌ ఇంజినీరింగ్‌ పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్‌ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు లభించినట్లు డైరెక్టర్‌ కుమారస్వామిగుప్తా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ హ్యూందాయ్‌ మోటార్‌ ఇండియా ఆర్‌అండ్‌డీ విభాగంలో గ్రాడ్యుయేట్‌ ఇంజనీర్‌ ట్రెనీగా విద్యార్థులు నిహారిక, ఉదయ్‌, హేమంత్‌ నియమితులయ్యారన్నారు. గత మార్చినెలలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ ఐటీలో జరిగిన ప్రాంగణ ఎంపికల ద్వారా ఇంటర్న్‌ షిప్‌ సాధించి, మూడు నెలల తర్వాత జీఇటిగా నియమితులైనట్లు డైరెక్టర్‌ వెల్లడించారు. వీరి ఎంపికపై డైరెక్టర్‌తో పాటు పరిపాలన అధికారి రవికుమార్‌, అకాడమిక్‌ డీన్‌ రత్నకుమారి హర్షం వ్యక్తం చేశారు.

వైద్యం.. అస్తవ్యస్తం!

కడప రిమ్స్‌లో వైద్య సేవలు దైన్యంగా మారాయి. రోగుల పట్ల సేవాభావం లోపించింది. పెద్ద పెద్ద భవంతులున్నా, అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. అల్ట్రా సౌండ్‌ స్కానింగ్‌ కోసం మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్స్‌రే, బ్లడ్‌ రిపోర్టులు, సిటీ స్కానింగ్‌, ఎంఆర్‌ఐ స్కానింగ్‌ల రిపోర్టులను ఆలస్యంగా అందిస్తున్నారు. వెరసి వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. ఐసీయూ యూనిట్లు నిర్వహణ అధ్వానంగా ఉంది. 'సాక్షి' బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ, ఐపీ విభాగాలలో చేసిన గ్రౌండ్‌ రిపోర్ట్‌లో అనేక విషయాలు వెలుగు చూశాయి.

- ప్రతిరోజు వందలాది మంది రోగులు కడప రిమ్స్‌కు రాక
- అంతంత మాత్రంగానే అందుతున్న వైద్య సేవలు
- అత్యవసర సేవలకు తప్పని ఇబ్బందులు
- సూపర్‌ స్పెషాలిటీ ఓపీ సేవలకే పరిమితం



రిమ్స్‌ గైనకాలజీ విభాగం ఎదురుగా నేలపై కూర్చొన్న రోగుల సహాయకులు

సాక్షి ప్రతినిధి కడప/అర్బన్‌: జిల్లా నలుమూలల నుంచి అనేక వ్యాధులతో సతమతమవుతున్న రోగులు కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్‌)ను ఆశ్రయిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలను అందిస్తున్నారు. ఐపీ సేవలను 24''7 పద్ధతిలో నిరంతరం అందిస్తున్నారు. ఓపీ, ఐపీ విభాగాల్లో రోగులు కొన్నిచోట్ల ఫ్యాన్లు తిరగడం లేదు. తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. రేడియాలజీ విభాగంలో అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌ చేయించుకునేందుకు వచ్చే గర్భిణులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్స్‌రేలు, బ్లడ్‌ రిపోర్టులు, స్కానింగ్‌ల రిపోర్టులను ఆలస్యంగా అందిస్తున్నారు.

- గతేడాది మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రిమ్స్‌ ఆవరణలోనే సూపర్‌ స్పెషాలిటీ వైద్య ఆస్పత్రిని కూడా ప్రారంభించారు. అక్కడ కూడా రోజూ 120–170 మంది వరకు ఓపీ సేవలను పొందుతున్నారు. పరికరాలు, వైద్య సిబ్బంది కొరత వల్ల ఓపీ సేవలకే ఇక్కడ పరిమితమవుతోంది. ఆపరేషన్‌ థియేటర్లు ప్రారంభిస్తే సూపర్‌ స్పెషాలిటీసేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయి.

పూర్తి స్థాయి సమయం వెచ్చించని వైద్యులు
జిల్లా నలుమూలల నుంచి జనరల్‌ మెడిసిన్‌, సర్జికల్‌, ఆర్థోపెడిక్‌, ఈఎన్‌టీ, చర్మవ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, కంటి పరీక్షలు, కేన్సర్‌ తదితర వ్యాధులతో బాధపడుతూ ఓపీ సేవలను పొందేందుకు రిమ్స్‌కు వస్తున్నారు. ఉదయం ఓపీకి రాగానే అక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది విద్యార్థుల ద్వారా 'అభ' యాప్‌ను డౌన్‌లోడ్‌ చేయించి ఓటీపీల ద్వారా పర్మినెంట్‌గా నెంబరును నమోదు చేసుకునేందుకు ప్రతి మనిషికి 5–10 నిమిషాలు వేచి చూడాల్సి వస్తోంది. తర్వాత ఓపీ చీటీ తీసుకుని సంబంధిత విభాగానికి రోగులు వెళుతున్నారు. అక్కడ ప్రధాన వైద్యులు కొంత సేపు పరీక్షలు చేసి తర్వాత పీజీలకు, హౌస్‌ సర్జన్లకు వదిలేస్తున్నారు. డాక్టర్లు పూర్తి స్థాయి సమయం వెచ్చించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇక వైద్యులు, సిబ్బంది షిఫ్టులు మారే ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు, రాత్రి 8 గంటల సమయాలలో అత్యవసర సమయాలలో ఎవరైనా వస్తే వారిని పట్టించుకునేందుకు 20–30 నిమిషాలు ఆలస్యం జరుగుతోంది. రోజూ ఓపీ సేవలను 1000కి పైగా నమోదవుతున్నాయి.

ఆలస్యం చేస్తున్నారు




నా పేరు నాగ మునెమ్మ. మాది కమలాపురం మండలం పెద్ద చెప్పలి గ్రామం. ఈనెల 11న క్యాజువాలిటీకి జ్వరంతో బాధపడుతూ వచ్చాను. అక్కడ డాక్టర్లు చూసి వార్డులో అడ్మిషన్‌ చేశారు. తర్వాత ఓపీలో చూపించుకోవాలని ఈరోజు పంపించారు. ఉదయం 10 గంటలకు వచ్చి ఓపీలో కూ ర్చొంటే గంటకుపైగా సమయం పట్టింది. ఆలస్యం చేస్తున్నారు.

- సోమవారం 1,125 మంది వైద్యసేవలు తీసుకున్నారు.

వైద్య సేవలపై లోపించిన అవగాహన...
ఓపీ ద్వారా వైద్యసేవలు అందుకుంటున్న రోగులకు సూపర్‌ స్పెషాలిటీ వైద్యం పట్ల అవగాహన లోపించింది. ఓపీ నుంచి సూపర్‌ స్పెషాలిటీకి వెళ్లే దారిని కూడా కనుగొనలేని పరిస్థితిలో ఉన్నారు.

- రక్త పరీక్షల విభాగంలో ల్యాబ్‌ టెక్నిషియన్లు పరిమితంగా ఉంటూ, మెడికల్‌ ల్యా బ్‌ ట్రైనీ విద్యార్థులే ఎక్కువ మంది కన్పిస్తున్నారు.
- ఆయా విభాగాల వద్ద కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. మలమూత్రశాలల్లో నీరు వృథాగా పోవడం, బేసిన్లు సరిగా లేకపోవడం, కొన్ని కుర్చీలను, స్ట్రెక్చర్లను విడిభాగాలు మూలన పడేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇక పారిశుద్ధ్య కార్మికుల కొరత వల్ల మధ్యాహ్నం వరకు టాయిలెట్లు శుభ్రపరుస్తూనే ఉన్నారు. దీనివల్ల అత్యవసరంగా సేవలు విని యోగించుకోవాలనుకున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐపీ విభాగంలో సౌకర్యాలు అరకొరే..
ఇన్‌ పేషెంట్‌(ఐపీ) విభాగంలో ప్రధానంగా గైనకాలజీ విభాగం ముందు కూర్చొనేందుకు కుర్చీలు లేక అలాగే నేలపై రోగుల సహాయకులు, బంధువులు సేద తీరుతున్నారు. ఓపీలో క్యాంటీన్‌ ముందు కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. వార్డులలో ఉంటున్న రోగులకు అందిస్తున్న పోషకాహారం పరిమాణం అంతంత మాత్రమే అయినా రోగి చేరిన వెంటనే కాకుండా వారికి ఆహారం అందించడంలో దాదాపు 24 గంటలపాటు ఆలస్యమవుతోంది. మెడికల్‌ ఐసీయూ విభాగంలో ఏసీలు పనిచేయక రోగులు పెడస్టల్‌ ఫ్యాన్ల ద్వారా వచ్చే గాలితో సర్దుకుపోవాల్సి వస్తోంది. మెడికల్‌ ఐసీయూలోనే ఏసీలు పనిచేయకపోతే ఎంత దుర్భరమైన పరిస్థితి ఉంటుందో అర్థమవుతోంది. కాగా, జనరల్‌ మెడిసిన్‌, జనరల్‌ సర్జరీ, కాన్పుల విభాగం, ఆర్థోపెడిక్‌, ఈఎన్‌టీ, కంటి విభాగాలలో వైద్య సేవలను ఓపీ, ఐపీ విభాగాల్లో ప్రధానంగా అందిస్తున్నారు. కాగా ఈ హాస్పిటల్స్‌లో ఆపరేషన్‌ థియేటర్లు, పరికరాలు, సిబ్బంది కొరతను భర్తీ చేస్తే మరిన్ని సూపర్‌ స్పెషాలిటీ సేవలు అందించే అవకాశం ఉంటుంది.



వైద్యులు త్వరగా చూడాలి



సెల్‌లో అభ యాప్‌ డౌన్‌లోడ్‌ చేసేందుకు ఆలస్యమైంది. మా నాన్నకు శరీరమంతా చచ్చుగా ఉంటే చూపించుకునేందుకు వచ్చాం. ఆలస్యమవుతున్న కొద్ది మా నాన్నకు ఆరోగ్యం క్షీణిస్తూ ఉంది. - మున్ని, కడప

గంట నుంచి నిలబడే ఉన్నా



ఓపీ విభాగంలో కాన్పుల విభాగంలో డాక్టర్‌ చూసిన వెంటనే అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌ చేయించుకుని రమ్మని చెప్పారు. 11 గంటల నుంచి రేడియాలజీ విభాగానికి వచ్చి నిలబడే ఉన్నాను. ఎక్కువ మంది వస్తే నిలబడాల్సిందే. –సుజ్జి,గర్భిణీ, కడప



ఓపీ కోసం క్యూలో నిలబడిన ప్రజలు



మూలన పడేసిన వీల్‌ చైర్‌



తండ్రి ఇనాయతుల్లాను స్ట్రెచర్‌పై తీసుకువస్తున్న కుమారుడు జాఫర్‌వలీ



మధ్యాహ్నం సమయంలో మరుగుదొడ్లను శుభ్రపరుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

ఓపీ కోసం బారులు తీరిన జనం



నాలుగు వార్డులకు ఒక నర్సు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో నర్సుల కొరత ఉంది. ఈ ఆస్పత్రికి రోజు సుమారు 1100 మంది వరకు రోగులు ఓపీలో చికిత్సలు చేయించుకోగా 350కి పైగా వివిధ రకాల వ్యాధి గ్రస్తులు వార్డుల్లో అడ్మిట్‌ అవుతున్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత
350 పడకల కలిగిన జిల్లా ఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తుంది. ఆస్పత్రిలో అన్ని విభాగాలకు సంబంధించి సుమారు 40 మంది వైద్యులు ఉన్నారు. ప్రధానమైన సివిల్‌ సర్జన్ల కొరత ఉంది. అలాగే ఆస్పత్రిలో 22 వార్డులు ఉన్నాయి. 70 స్టాఫ్‌ నర్సు పోస్టులు ఉండగా ఇటీవల 48కి కుదించారు. నర్సుల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆనంద్‌బాబు తెలిపారు.

పవర్‌ కట్‌ అయితే.. రోగులు చీకట్లోనే
ఆస్పత్రిలో ఎక్కువ విభాగాలు, వార్డులు ఉన్నందున తరచూ ఎక్కడో చోట విద్యుత్‌ సమస్య ఉత్పన్నం అవుతుంటుంది. ఇటీవల ఎలక్ట్రీషియన్‌ పోస్టును పూర్తిగా రద్దు చేశారు. దీంతో విద్యుత్‌ సమస్య వచ్చినప్పుడు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడున్న ఆక్సిజన్‌ ప్లాంట్‌ మూలన పడింది.



నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్‌ ప్లాంట్‌

ప్రభుత్వాసుపత్రిలో వసతుల కొరత



ప్రభుత్వ ఆసుపత్రి

పులివెందుల: పులివెందుల వైఎస్సార్‌ గవర్నమెంట్‌ జనరల్‌ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ప్రభుత్వాసుపత్రికి నిత్యం 400 నుంచి 500 మంది రోగులు వివిధ రకాల వ్యాధులతో వైద్యసేవల కోసం ఆసుపత్రికి వస్తున్నారు. అయితే తగినంత వైద్యసిబ్బంది అందుబాటులో లేరు. ఆసుపత్రిలో అన్నిరకాల విభాగాలకు 170 మంది వైద్యులు అవసరం ఉండగా 90మంది మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే 200మంది నర్సులు ఉండాల్సి ఉండగా 178 మంది విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు సంబంధించి వైద్యులు లేకపోవడంతో పిల్లలకు వైద్య సేవలు అందడం లేదు. అలాగే స్కానింగ్‌కు సంబంధించి సిటిస్కాన్‌, ఎమ్‌ఆర్‌ఐ స్కాన్‌లు ఇక్కడ అందుబాటులో లేవు. ఆక్సిజన్‌కు సంబంధించిన ప్లాంట్‌ను పాత ఏరియా ఆసుపత్రి నుంచి కొత్త ఆసుపత్రికి ఇంకా తరలింపు కాకపోవడంతో ప్రస్తుతం సిలిండర్ల ద్వారా రోగులకు ఆక్సిజన్‌ అందిస్తున్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి అన్ని రకాల సదుపాయాలు ఆసుపత్రిలో కల్పించాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

రోగులు ఫుల్‌..బెడ్స్‌ నిల్‌



రక్త పరీక్షల కోసం క్యూ కట్టిన రోగులు

జమ్మలమడుగు రూరల్‌: జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకు ఓపి 600 పైబడి ఉంటుంది. అయితే రోగులకు తగ్గట్టుగా బెడ్స్‌ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి ఒక్క బెడ్‌కు ఇద్దరు రోగులను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలినప్పుడు బెడ్స్‌ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

వంద పడకలు పూర్తయితే బాగుంటుంది
ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజు 600 మంది పైబడి రోగులు వస్తున్నారు. రోగులు ఎక్కువ మంది వచ్చినప్పుడు బెడ్స్‌ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో ఒక్కో సారి బెడ్‌కు ఇద్దరిని ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. ఇటీవలే వంద పడకలు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. వంద పడకలు పూర్తయితే రోగులకు మరింత బాగుంటుంది.

–రఫీక్‌ పాషా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌

బాగా చదివి అత్యున్నత స్థానాలకు ఎదగాలి

ఉపకార వేతనాలు అందజేసిన ఎస్పీ వి.హర్షవర్ధన్‌ రాజు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు

కడప అర్బన్‌ : పోలీస్‌ కుటుంబాల పిల్లలు బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌ రాజు ఆకాంక్షించారు. స్థానిక 'పెన్నార్‌ పోలీస్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌'లో పోలీసులు, హోమ్‌గార్డ్స్‌ కుటుంబాలకు చెందిన 59 మంది పిల్లలకు మెరిట్‌ స్కాలర్‌ షిప్‌, ప్రశంసాపత్రం ఎస్పీ అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మనసుకు నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఇంటర్‌ మీడియట్‌ దశ చాలా కీలకమైనదని, అహర్నిశలు శ్రమించి చదివిస్తున్న తల్లిదండ్రులను గుర్తుంచుకుని లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్‌) లోసారి సుధాకర్‌, అదనపుఎస్పీ(ఏఆర్‌)ఎస్‌.ఎస్‌.ఎస్‌.వి కృష్ణారావు, స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్‌ యు.వెంకటకుమార్‌, ఆర్‌.ఐ టైటస్‌, పోలీస్‌ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్‌, పోలీస్‌, హోంగార్డ్స్‌, కుటుంబాల చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలకు సిద్ధం

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కడప జిల్లా పోలీస్‌ పరేడ్‌ మైదానంలో పోలీసుల రియల్‌ టైం ఫుల్‌ డ్రెస్‌ కవాతు రిహార్సల్స్‌ను బుధవారం నిర్వహించారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌ రాజు జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం కవాతు రియల్‌ టైం ఫుల్‌ డ్రెస్‌ రిహార్సల్స్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. భద్రత, పలువురికీ ఏర్పాట్లను పరిశీలించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు.

శతాధిక... సమర యోధుడు



బాల యల్లారెడ్డి

చెన్నూరు: స్వాతంత్య్ర ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం అనుభవించి.. శత సంవత్సరాలు దాటినా నేటికీ క్షేమంగా గడుపుతున్న సమరయోధుడు బాల ఎల్లారెడ్డి. 1921 జనవరిలో జన్మించిన ఆయన దేశంపై అంకిత భావం పెంచుకుని స్వాతంత్య్రోద్యమంలో కష్టాలు పడ్డారు. జిల్లాలో 15 మంది స్వాతంత్య్ర సమరయోధులు జైలు జీవితాలు గడిపారు.. వారిలో 14 మంది మృతిచెందగా. 104 ఏళ్ల ఎల్లారెడ్డిని సాక్షి పలుకరిస్తే విశేషాలు చెప్పారు.

నాకు న్యాయం జరగలేదు

చెన్నూరు మండలం ఆయన స్వస్థలం కాగా.. ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. క్విట్‌ ఇండియా ఉద్యమంలో కీలకంగా ఉంటూ ఆరు నెలలపాటు జైల్లో గడిపినట్లు ఆయన తెలిపారు. 104 సంవత్సరాలు కలిగిన సీనియర్‌ స్వాతంత్ర సమర యోధుడైన తనకు గౌరవం, సముచిత స్థానం కల్పించ లేదని ఆవేదన చెందారు. కలెక్టర్లు తన వద్దకు తన మనవడు తేజేశ్వరరెడ్డికి చదువు ఆధారంగా ఉద్యోగం కల్పిస్తామని చెప్పి.. అనంతరం మరచిపోయారని అన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో మునిరెడ్డి



రావుల మునిరెడ్డి

రాజుపాళెం: రాజుపాళెం మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన రావుల మునిరెడ్డి స్వాతంత్య్ర సమరంలో పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన 1906 సంవత్సరంలో రైతు కుటుంబంలో జన్మించారు. పెద్దగా చదువుకోకున్నా స్వయం కృషితో నిరంతరం విజ్ఞానం పెంపొందించుకుంటూ ఉండేవారు. 1934లో కాంగ్రెస్‌ పార్టీలో చేరి తాలూకా కాంగ్రెస్‌ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే అంచెలంచెలుగా ఎదుగుతూ 1938 లో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, తాలుకా వ్యవసాయ కూలీల సంఘం ఆర్గనైజర్‌గా కూడా పనిచేశారు. 1941లో యుద్ధ వ్యతిరేక సత్యాగ్రహంలో భాగంగా దువ్వూరులో కార్యక్రమం చేపట్టారు. ఆయనను ఆంగ్లేయులు అరెస్టు చేయడంతో నాలుగు నెలలజైలు శిక్ష అనుభవించారు. 1947లో శాంతి సంఘాన్ని స్థాపించి గ్రామ కక్షల నివారణకు కృషి చేసిన దేశ భక్తుడని పలువురు కొనియాడుతున్నారు. 1982లో ఆయన తనువు చాలించారు. ఆయన సేవలకు గుర్తుగా ఈ ఏడాది జనవరి 24న వెలవలి గ్రామంలో విగ్రహాన్ని నెలకొల్పారు.

పరువు హత్యా..? ఆత్మహత్యా..?

- తంబళ్లపల్లెలో బాలిక అనుమానాస్పద మృతి
- కుళ్లిన స్థితిలో ఉండటంవల్లే మృతదేహాన్ని కాల్చేశారు
- ఫోరెన్సిక్‌ పరీక్షకు బూడిద, ఎముకల సేకరణ
- ఈ ఘటనకు ముందు తంబళ్లపల్లెలో అదృశ్యం కేసు నమోదు
- వరుసకు సోదరుడైన వ్యక్తితో ప్రేమ వ్యవహారం విషాదాంతం



మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



బాలిక ఉరివేసుకున్న చెట్టును పరిశీలిస్తున్న ఎస్‌ఐ, పోలీసులు



మృతురాలు (ఫైల్‌)

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజక వర్గం పెద్దమండ్యం మండలంలో అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని కనిపించిన 17 ఏళ్ల బాలిక ఘటన పరువు హత్యానా లేక ఆత్మహత్యానా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రేమించుకున్న వారి కులాలు, మతాలు వేరయితే..అది తల్లిదండ్రులకు ఇష్టంలేక ఏదైనా చర్యకు పాల్పడితే దాన్ని పరువు హత్యగానో ఇంకోలాగో చెప్పుకుంటాం. అయితే ఈ బాలిక ప్రేమించిన వ్యక్తి ఒకే కులానికి చెందిన యువకుడే. అయితే వారిద్దరిదీ సోదరీ, సోదరుల వరుస అవుతుంది. మృతదేహాన్ని కాల్చివేయడం ద్వారా అనుమానాలు వ్యక్తం కావడంతో తంబళ్లపల్లె పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబీకులు, స్థానికులు, పోలీసుల కథనం మేరకు..

వరుసకు సోదరుడితో..

ఓ నిరుపేద కుటుంబంతంబళ్లపల్లె మండలం ఎగువబోయపల్లెలో నివాసముంటోంది . భార్యతో కలిసి కూలిపనులకు వెళ్తేకాని పూట గడవని స్థితి. ఈ పల్లెలో బోయ సామాజిక వర్గానికి చెందిన సుమారు 90 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వీరిలో దాయాది కుటుంబాలు, ఒకే కుటుంబం నుంచి వేరుపడిన కుటుంబాలున్నాయి. కూలి పనులకు వెళ్లే ఓ వ్యక్తికి 17 ఏళ్ల కుమార్తె ఉంది. ఆమె, వరుసకు సోదరుడైన యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలిక తండ్రి తన కుమార్తెకు వివాహం చేయాలనే ప్రయత్నాల్లో ఉండగా గతనెల 22న అదృశ్యమైంది. తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోదరుడి వరుసైన యువకుడితో కలిసి వెళ్లినట్టు కుటుంబీకులు అనుమానంతో వెతకగా ఈ నెల 8న ఆచూకీ లభ్యమై బాలికను తీసుకొచ్చారు. తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారుల ఎదుట హాజరుపర్చి కుటుంబీకులకు అప్పగించారు. ఇంతటితో కథ సుఖాంతమైందని భావించారు.

తల్లితో బయటకొచ్చి..

ఈనెల 8వ తేదీ గురువారం రాత్రి ఇంట్లోనే ఉన్న బాలిక మరుసటిరోజు 9వ తేదీ శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళ్లాలని తల్లితో చెప్పగా ఆమె తోడుగా గ్రామ శివారులోకి వెళ్లగానే తల్లిని వదిలి పరుగెత్తి వెళ్లిపోయింది. కుమార్తె వెంట పరుగు తీయలేని తల్లి గ్రామానికి వచ్చి విషయం చెప్పడంతో బంధువుల యువకుడితో కలిసి వెళ్లి ఉంటుందని భావించి అతని కోసం ఆరా తీయగా ఇక్కడే ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. దీనిపై గ్రామస్తులు సోదరి, సోదరుల వరుస కలిగి ప్రేమించుకోవడం సమంజసం కాదని సదరు యువకుడికి సూచించి వారి బంధం కొనసాగించవద్దని కోరారు.

శవమై కనిపించి..

తల్లితో కలిసి ఇంటినుంచి వెలుపలికి వచ్చి పరారైన బాలిక స్వగ్రామం ఎగువబోయపల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలోని పెద్దమండ్యం మండలం బండ్రేవు పంచాయతీలోని నల్లగుట్ట అడవిలోని చెట్టుకు శవమై వేలాడుతూ సోమవారం సాయంత్రం (12వ తేదీ) గొర్రెలకాపరులకు కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు మంగళవారం మృతదేహాన్ని అడవిలోనే కట్టెలు పేర్చి అంత్యక్రియలు నిర్వహించి దహనం చేశారు. శ్వేత శుక్రవారమే పరారై అదేరోజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని, నాలుగురోజులు మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండటం, పురుగులు పట్టడంతో ఇంటికి తీసుకొచ్చే పరిస్థితి లేక అక్కడే దహనం చేశారని అంటున్నారు. ఈ కార్యక్రమానికి పదిమంది వరకు హాజరైనట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఈ ఘటనపై బండ్రేవు వీఆర్‌ఏ వేణుగోపాల్‌ వీఆర్‌ఓ పక్కీర్‌ షావలీకి చెప్పడంతో ఆయన పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.వెంకటశివ చెప్పారు.

హత్యా..ఆత్మహత్యా..

బాలిక మృతి ఘటనపై బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌ నాయుడు స్పందించి వివరాలు తెలుసుకున్నారు. సత్వరమే కేసు చిక్కుముడి విప్పాలని డీఎస్పీని ఆదేశించారు. దీంతో డీఎస్పీ రెడ్డయ్యనాయుడు, సీఐ మధులు కేసును వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ప్రాథమికంగా బాలిక మరణం ఆత్మహత్యే అని గ్రామస్తులు భావిస్తున్నప్పటికీ పోలీసులు అనుమానాలతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు. ఆధారాల సేకరణ, సాంకేతిక వివరాలను పరిశీలిస్తున్నారు. మృతదేహం దహనం చేయడంతో బూడిద, ఎముకలను సేకరించిన పోలీసులు వాటిని ఫోరెన్సిక్‌ ల్యాబ్‌కు పంపుతున్నారు. బాలిక ఉరి వేసుకున్నట్టుగా భావిస్తున్న చెట్టును పోలీసులు నిశితంగా పరిశీలించారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

రాజ్‌భవన్‌కు స్టాఫ్‌ నర్సులు

- ఎట్‌ హోం కార్యక్రమానికి రావాలని ఆహ్వానం
- గవర్నర్‌ విందుకు హాజరు కానున్న ఫాతిమా, మానస

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌ నర్సులు సూర్య ఫాతిమా, మానసలకు అరుదైన అవకాశం లభించింది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం సాయంత్రం రాజ్‌ భవన్‌లో గవర్నర్‌ ఎస్‌.అబ్దుల్‌నజీర్‌ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఎట్‌ హోం' కార్యక్రమానికి రావాల్సిందిగా ఇరువురికీ ఆహ్వానం అందినట్లు ఆస్పత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆనంద్‌బాబు తెలిపారు. క్రీడలు, ఉపాధ్యాయురాలిగా, నర్సులగా అనేక రంగాల్లో ప్రతిభ కనబరచడంతో ప్రత్యేక కేటగిరీలో ఫాతిమాకు, క్రీడల్లో జాతీయ పురస్కారాలు సాధించిన మానసలకు దక్కిన గౌరవం ఇది అని ఆయన తెలిపారు. బుధవారం రాత్రి ఇద్దరూ విజయవాడకు బయలుదేరి వెళ్లారన్నారు.

వివిధ రంగాల్లో ప్రతిభ



చిత్తూరు జిల్లాకు చెందిన షేక్‌ సూర్య ఫాతిమా ఎంఎస్‌సీ నర్సింగ్‌ చేసి 2011లో స్టాఫ్‌ నర్సుగా ఎంపికయ్యారు. ఫాతిమా తండ్రి సీఎస్‌. ఇమాంఅలీ ఆర్మీలో పనిచేస్తూ రిటైర్డ్‌ అయ్యారు. తల్లి జహిదాబీ గృహిణి. వారికి ఫాతిమాతో పాటు కుమారులు రియాజ్‌ బాషా, ఖాదర్‌హుస్సేన్‌ సంతానం. సూర్యఫాతిమా నర్సింగ్‌లో పీహెచ్‌డీ చేస్తూనే వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతూ వచ్చారు. 2022లో బెంగళూరులో ఆల్‌ ఇండియా ఉమెన్స్‌ అచీవ్‌మెంట్స్‌ అవార్డు, ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ అసోసియేషన్‌ వారిచే చేంజ్‌ మేకర్‌ ఆఫ్‌ ఏసియా, కరోనా వారియర్‌ అవార్డులు అందుకున్నారు. ఢిల్లీ ఎన్‌క్యాష్‌ వారిచే అకాడమీ ఆఫ్‌ హాస్పిటల్‌ అడ్మినిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, 2021లో ఇంటర్నేషనల్‌ బెస్ట్‌ పోస్టర్‌ ప్రెజెంటేషన్‌ అవార్డు, గుంటూరు స్విమ్స్‌ నర్సింగ్‌ కాలేజిలో బెస్ట్‌ టీచర్‌ అవార్డులు దక్కించుకున్నారు. ఆల్‌ ఇండియా సివిల్‌ సర్వీసెస్‌ వెయిట్‌ లిఫ్టింగ్‌, పవర్‌లిఫ్టింగ్‌ పోటీల్లో పాల్గొని రాణించారు.

అథ్లెటిక్స్‌లోనూ మానస



రోగులకు సేవలందిస్తూనే మరో వైపు మానస అథ్లెటిక్‌గా సత్తా చాటుతున్నారు. ఎర్రగుంట్లకు చెందిన మానస ఐదేళ్ల నుంచి జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. ఆమె తండ్రి మునిస్వామి నాపరాళ్ల ఫ్యాక్టరీలో పని చేస్తుంటారు. తల్లి సువర్ణ గృహిణి. వీరికి మానసతో పాటు కుమారుడు భరత్‌కుమార్‌ సంతానం. మానస బీఎస్సీ నర్సింగ్‌ చేశారు. స్టాఫ్‌నర్స్‌ ఉద్యోగం సాధించడంతోపాటు తనకు ఎంతో ఇష్టమైన అథ్లెటిక్‌లో రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచి ఆరు సార్లు జాతీయ స్థాయికి ఎంపికై అథ్లెటిక్‌ పోటీల్లో పాల్గొన్నారు. 2020లో బెస్ట్‌ ఎంప్లాయిమెంట్‌ అవార్డుతో మానసను సత్కరించారు. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలో నిర్వహించిన ఆల్‌ ఇండియా సివిల్‌ సర్వీసెస్‌ నేషనల్స్‌ వెయిట్‌లిఫ్టింగ్‌, పవర్‌లిఫ్టింగ్‌ టోర్నమెంట్‌ పోటీల్లో ఏపీ తరపున మానస పాల్గొన్నారు. 55 కేజీల వెయిట్‌ లిఫ్టింగ్‌ కేటగిరి లోనూ, 52 కేజీల పవర్‌లిఫ్టింగ్‌ కేటరిగిలో బంగారు పతకం అందుకున్నారు.

పశ్చిమగోదావరి జట్టు ఘనవిజయం

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్‌ జిల్లాల అండర్‌-19 మల్టీ డేస్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో పశ్చిమగోదావరి జట్టు ఘన విజయం సాధించింది. కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 268 పరుగుల ఓవర్‌ నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 81.3 ఓవర్లలో 340 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులో ఓవర్‌నైట్‌ బ్యాట్స్‌మన్‌ నాగరేవంత్‌ 133 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు లోకేష్‌ 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన నెల్లూరు జట్టు 42 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌట్‌ అయింది. జట్టులోని మన్విత్‌ రెడ్డి 42 పరుగులు, లోకేష్‌ 40 పరుగులు చేశారు. దీంతో పశ్చిమగోదావరి జట్టు 38 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

విజయం దిశగా విశాఖ

వైఎస్‌ఆర్‌ఆర్‌-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 356 పరుగుల ఓవర్‌ నైట్‌ స్కోరుతో రెండో రోజు బరిలోకి దిగిన విశాఖ జట్టు 132.5 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని యశ్వంత్‌ 72, దేవాశిష్‌ 72 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు ఆదర్శ్‌ 5 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్‌ 38, వరుణ్‌సాత్విక్‌ 37 పరుగులు చేశారు. కాగా రెండోరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టు 336 పరుగుల వెనుకంజలో ఉంది.

పోటాపోటీగా చిత్తూరు, కడప మ్యాచ్‌..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 293 పరుగుల ఓవర్‌ నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 116 ఓవర్లలో 365 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని బాలాజీ 79 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కడప బౌలర్లు నాగకుల్లాయప్ప 6 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 63 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్‌ 149 బంతుల్లో 31 ఫోర్లు, 4 సిక్సర్లతో 194 పరుగులు చేశాడు. రణదీర్‌రెడ్డి 83 పరుగులతో రాణించారు. చిత్తూరు బౌలర్లు సాయిహర్షిత్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్‌



బీమా బాండ్లు అందజేస్తున్న టెక్నికల్‌ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, తదితరులు

పులివెందుల రూరల్‌ : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతీ సిమెంట్‌ పటిష్టమైందని భారతీ సిమెంట్‌ కంపెనీ టెక్నికల్‌ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్‌ రెడ్డి, నాగేంద్ర, సేల్స్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రంగనాథస్వామి ఆలయ సమీపంలోని మైరా హోటల్‌ నందు 60 మంది బిల్డర్లు, మేస్త్రీలకు సిమెంట్‌ నాణ్యత, వినియోగంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీ సిమెంట్‌ రోబోటెక్‌ టెక్నాలజీతో తయారవుతోందని, అల్ట్రా ఫాస్ట్‌ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర కంపెనీల సిమెంట్‌ ఐదు గంటల్లో సెట్‌ అయితే.. భారతీ అల్ట్రా ఫాస్ట్‌ రెండు గంటల్లోనే సెట్‌ అవుతుందన్నారు. చాలా ధృఢత్వాన్ని కలిగి, కట్టడాలు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. అనంతరం 60 మంది మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత బీమా బాండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్‌ అశోక్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.


కడపకు చేరుకున్న మంత్రి ఫరూఖ్‌



మంత్రి ఫరూఖ్‌తో చర్చిస్తున్న కలెక్టర్‌, ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్‌ : దేశ 78వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా కడపలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూఖ్‌ బుధవారం రాత్రి కడపకు చేరుకున్నారు. స్థానిక స్టేట్‌ గెస్ట్‌ హౌస్‌ వద్ద మంత్రికి కలెక్టర్‌, జిల్లా ఎస్పీ స్వాగతం పలికారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు. అలాగే మంత్రిని కలిసిన వారిలో జాయింట్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో గంగాధర్‌ గౌడ్‌, మైనారిటీ కార్పొరేషన్‌ ఈడీ డాక్టర్‌ వల్లూరి బ్రహ్మయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్‌, టీడీపీ నేతలు అమీర్‌ బాబు, గోవర్దన్‌ రెడ్డి, హరిప్రసాద్‌, జిల్లా అధికారులు ఉన్నారు.

ఫ్లైయాష్‌ ట్యాంకర్లను అడ్డుకుని ఆందోళన



చిలంకూరులో నిలిచిన ట్యాంకర్లు



ట్యాంకర్లను నిలిపివేసిన గ్రామస్తులు

ఎర్రగుంట్ల : ఫ్లైయాష్‌ దుమ్ముతో చాలా ఇబ్బంది పడుతున్నామని మండలంలోని చిలంకూరు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ నుంచి వస్తున్న ఫ్లైయాష్‌ ట్యాంకర్లను చిలంకూరు గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాష్‌ ట్యాంకర్లు, టిప్పర్లు గ్రామంలో తిరుగుతున్నాయనన్నారు. ఫ్లైయాష్‌ దుమ్ము విపరీతంగా రావడంతో తాము అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్లు, టిప్పర్లు గ్రామం నుంచి వెళ్లడంతో ఇబ్బంది పడుతున్నామని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

పులివెందుల రూరల్‌ : పులివెందుల-కదిరి రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. చొరబడిన దొంగలు రూ.4,23,160ల నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీనాయక్‌ , ఎస్సై అనిల్‌ కుమార్‌ మద్యం దుకాణాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. దుకాణ సిబ్బంది మాట్లాడుతూ రోజు మాదిరిగానే తాము దుకాణానికి తాళాలు వేశామని, తలుపులు పగలగొట్టి దుకాణంలో డబ్బు చోరీ చేశారని సిబ్బంది తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్‌ : కడప నగరంలోని టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో అగాడివీధికి చెందిన షేక్‌ కరీముల్లా(55) ఈ నెల 13న సాయంత్రం ఇంటిలో సీలింగ్‌ కొక్కేనికి నవారు వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీముల్లా ఆటో నడుపుతూ జీవించేవాడని, మద్యానికి బానిసగా మారి ఈ చర్యలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఖదీరున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

28 బస్తాల రేషన్‌ బియ్యం స్వాధీనం

వల్లూరు : మండలంలోని గోటూరు పెట్రోల్‌ బంకు సమీపంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 28 బస్తాల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ మోహన్‌రావు తెలిపారు. సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆటో డ్రైవర్‌తో బాటు, బియ్యాన్ని తరలిస్తున్న సత్యసాయి జిల్లాకు చెందిన పఠాన్‌ కరీముల్లాను అదుపు లోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



యల్లారెడ్డి (ఫైల్‌)

బద్వేలు అర్బన్‌/వల్లూరు: పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల ఓ లాడ్జిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నూరు మండలం నరసారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిల్లి యల్లారెడ్డి (36) కడప నగరంలో నివసిస్తూ నగరంలోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈయనకు భార్య శ్రావణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సోమవారం బాకీ వసూలు విషయమై బద్వేలుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బద్వేలుకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం నెల్లూరు రోడ్డులోని లాడ్జిలో గది అద్దెకు తీసుకుని ఉన్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నం గదిలో నుండి దుర్వాసన వస్తుండటంతో లాడ్జి యాజమాన్యం అనుమానంతో అర్బన్‌ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్‌ ఎస్‌ఐ రవి కుమార్‌ సిబ్బందితో వచ్చి తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా యల్లారెడ్డి మృతి చెంది ఉన్నాడు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మాటు వేశారు.. మాయం చేశారు

స్కూటీ డిక్కీలో ఉంచిన రూ.లక్ష నగదు అపహరణ



రమణారెడ్డి

బద్వేలు అర్బన్‌ : స్కూటీ డిక్కీలో ఉంచిన రూ.లక్ష నగదును గుర్తు తెలియని దుండగులు పట్టపగలే అపహరించుకుపోయారు. బుధవారం బద్వేలు పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే అట్లూరు మండలం నల్లగొండుగారిపల్లె గ్రామానికి చెందిన అరవ రమణారెడ్డి గత పదేళ్లుగా పట్టణంలోని కుమ్మరి కొట్టాలులో నివసిస్తున్నాడు. ఓ బాకీ చెల్లించే విషయమై తన కుమారుడు జమ చేసిన రూ.లక్ష నగదును బుధవారం మైదుకూరు రోడ్డులోని ఓ బ్యాంక్‌లో డ్రా చేసుకుని స్కూటీ డిక్కీలో భద్రపరుచుకుని బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ కూల్‌డ్రింక్స్‌ షాపు వద్ద నీళ్ల బాటిల్‌ కొనుగోలు చేసి తిరిగి నెల్లూరు రోడ్డులోని బాకీ చెల్లించాల్సిన వ్యక్తి వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లి డిక్కీ తెరిచి చూడగా డిక్కీలో భద్రపరిచిన రూ.లక్ష నగదు కనిపించలేదు. దీంతో నగదు చోరీ అయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారిస్తున్నారు.